క్లుప్తంగా

మానవత జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య


రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య

తాళ్లపూడి: జిల్లా మానవత స్వచ్ఛంద సంస్థ 2025–26 సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడుగా రిటైర్డ్ హెచ్ఎం వాసిబోయిన చంద్రయ్య ఎంపికయ్యారు. సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ఆశీస్సులతో తనకు బాధ్యత అప్పగించినట్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నల్లజర్లలో బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. తాళ్లపూడిలో 2009లో సంస్థ మండల స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అనంతరం సెక్రటరీగా, అధ్యక్షుడిగా, ట్రెజరర్‌గా విధులు నిర్వహించారు. జిల్లాలో కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్‌గా, రీజియన్ చైర్మన్‌గా, కేంద్ర నియంత్రణ కమిటీ కన్వీనర్‌గా సేవలందించారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధి


కళాశాల ప్రాంగణంలో లెవెలింగ్ పనులు చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం పూర్తిగా పల్లంగా మారడంతో పాటు తుప్పలు పెరిగిపోయాయి. ఇటీవల ఓ కార్యక్రమం నిమిత్తం కళాశాలకు వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రాంగణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందుల మేరకు లోతట్టు ప్రాంతంలో ఫిల్లింగ్ పనులను ప్రారంభించారు. సమస్య తీరడంతో ప్రిన్సిపల్ గరగ శ్రీనివాస్, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

పెరవలి: గత నెల 27వ తేదీన తీపర్రులో పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో మృతు ఆచూకీ తెలిసిందని పెరవలి ఎస్సై యం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పొన్నాడ సత్యనారాయణ (76) జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నా వృద్ధులైనందున తమను పట్టించుకోవటం లేదని భార్య గత 4 ఏళ్లుగా మంచపై ఉండటంతో తనే సేవలు చేసేవాడని, పిల్లలు పట్టించుకోకపోవటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి


తాడిమళ్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాలాజీ

నిడదవోలు రూరల్: సైబర్ నేరాలపై యువత అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎల్. బాలాజీ సుందరరావు సూచించారు. మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలు, శక్తి యాప్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌ఛాట్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. ఆడపిల్లలకు సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా శక్తియాప్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై జి.కల్పన, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితం స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహనీయుల జీవితం స్ఫూర్తిదాయకమని జేసీ చిన్న రాముడు అన్నారు. పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భారత జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమర యోధుడు పింగళి వెంకయ్య త్యాగం చిరస్మరణీయమన్నారు. త్రివర్ణ పతాక రూపకల్పన సాధారణ విషయం కాదని, ఆ పని కోసం ఆయన ఐదేళ్లపాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల జెండాలపై అధ్యయనం చేశారన్నారు. ఈ తర్వాత సుమారు 30 డిజైన్లను సమర్పించగా, అందులో త్రివర్ణ పతాకం ఎంపికై భారత జాతీయ పతాకంగా ఆమోదించబడిందన్నారు. ఆంధ్ర – కర్ణాటక నాటక పితామహుడు బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. బ్రిటిష్ పాలనా కాలంలోనే తన కళతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహానుభావుడు రాఘవ అని గుర్తు చేశారు. అనేక సాంఘిక నాటకాల రచయితగా, ప్రజ్ఞాశీలిగా, నాటకరంగం మీద తనదైన ముద్ర వేసిన వ్యక్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు గుబులు

- ఉష్ణోగ్రతల మార్పులతో ఆందోళన
- జాడలేని వరుణుడు
- వరి కలుపులో రైతుల నిమగ్నం


తాళ్లపూడిలో వరి చేనులో కలుపు తీస్తున్న కూలీలు

తాళ్లపూడి: గతేడాది రైతులను కలవరపెట్టిన నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ముందుగానే వచ్చాయి. వాటికి తోడు ఈ ఏడాది విస్తారంగా వానలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పదేపదే చెప్పడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇక నైరుతి రుతుపవనాలు మే నెలలో ఇలా అడుగుపెట్టాయో లేదో అలా రెండ్రోజుల పాటు వరుసగా వానలు కురవడంతో ఈయేడు పంటలు సమృద్ధిగా పండుతాయని గంపెడు ఆశతో రైతులు పంట వేశారు. కానీ మూడ్రోజులు మురిపించిన వరుణుడు ఆ తర్వాత జాడ లేకుండా పోయాడు. ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు ఆందోళనలో పడిపోయారు. అధిక ఉష్ణోగ్రతలు రైతులకు అనేక విధాలుగా ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణంలోని మార్పులు కారణంగా వాతావరణ మార్పుల కారణంగా ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతుందని, రాబోయే దశాబ్దాలలో ఆహార ఉత్పత్తి 35% వరకు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి

నియోజకవర్గంలోని రైతన్నలు కోటి ఆశలతో తాళ్లపూడి మండలంలో 8,768 ఎకరాల్లో, కొవ్వూరు మండలంలో 10,790 ఎకరాలు, చాగల్లు మండలంలో 8,220 ఎకరాల్లో మొత్తం 27,778 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇటీవలే వరి నాట్లు పూర్తియ్యాయి. ప్రస్తుతం వరి చేలు దుబ్బు కట్టే దశలో ఉన్నాయి. 30 నుంచి 40 రోజుల మధ్యలో ఉన్నాయి. ఖరీఫ్ ప్రాంభంలో వర్షాలు కురిసినప్పటికి ప్రసుత్తం వర్షాలు అడపా దడపా కురుస్తున్నాయి. వర్షాలు కురిస్తేనే సాగు, దిగుబడి బాగుంటాయని రైతులు అంటున్నారు. వర్షాభావంతో పంటలపై ప్రభావం పడుతుంది. అయినప్పటికి రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రైతులను కలవరపెడుతున్నాయి.

కలుపు పనుల్లో నిమగ్నం

నియోజకవర్గంలో రైతులు వరిచేలల్లో కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కువ శాతం మంది రైతులు కలుపు మందులు వైపు మొగ్గుచూపుతున్నారు. కలుపు మందులు వాడినప్పటికి ప్రయోజనం లేక మళ్లీ కూలీలను పెట్టి కలుపు తీయిస్తున్నారు. వరి చేలల్లో కలుపు ప్రధాన సమస్యగా మారింది. 40 రోజుల వరకు ఎటువంటి పురుగు మందులు చల్లకూడదు. మందులు విచక్షణా రహితంగా పిచికారీ చేయడంతో పంటకు మేలు చేసే మిత్రపురుగులు చనిపోతాయని మండల వ్యవసాయాధికారిణి జి.రుచిత రైతులకు వివరించారు.

సవాళ్లు కొనసాగేనా..

ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ నైరుతి రుతుపవనాల జాడలేదు. అడపాదడపా అన్నట్లు చిరుజల్లులు తప్పితే భారీ వర్షాలే లేవు. ఆశతో విత్తనాలు వేసిన రైతులు కళ్లు కాయలు కాసేలా వానల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. విత్తన దశలోనే నష్టం చవిచూడాల్సి వస్తుందనే ఆందోళనతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

అధిక ఉష్ణోగ్రతలకు చేలల్లో నీరు వేడెక్కుతుంది. ఈ నేపథ్యంలో దుబ్బు పిలకలు కట్టడంతో ఎదుగుదల ఉండదు. నీటిని రోజు పెడుతూ ఉండాలి. ఎకరాకు 25 కిలోల చొప్పున సకాలంలో పొటాష్‌ను వేయాలి. దీంతో పంటకు రోగనిరోధక శక్తి పెరిగి వివిధ రకాల తెగుళ్లు, చీడ పీడల నుంచి తట్టుకుంటుంది. ఉక్కబోత వాతావరణం వల్ల మాగుడు తెగులు ఆశించే అవకాశం ఉంది. కనుక చేల గట్టుపై కలుపు, గడ్డిని పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ ఎకరాకు 400 ఎంఎల్ మందును పిచికారీ చేయాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు, యూరియా కూడా అధికంగా వాడరాదన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో స్థానం



వామిశెట్టి పరమేశ్వరరావు, పావని కుమారి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నల్లజర్ల మండలం సింగరాజుపాలెంకు చెందిన వామిశెట్టి పరమేశ్వరరావు, వామిశెట్టి పావని కుమారి దంపతులకు స్థానం లభించింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు దంపతులు తెలిపారు. రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా వామిశెట్టి పరమేశ్వరరావుని, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం కార్యదర్శిగా వామిశెట్టి పావని కుమారిని నియమించారు. తమపై నమ్మకంతో రాష్ట్రస్థాయి హోదాల్లో పదవులు ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ హోంమంత్రి, తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా విభాగం ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తిసుకువెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటాకిల్లు

ఉండ్రాజవరం: వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో తాటాకిల్లు దగ్ధమైన సంఘటన మండలంలో సత్యవాడలో శనివారం చోటు చేసుకుంది. మండలంలో సత్యవాడ శివారు చిలకపాడు రోడ్డులో తాటాకింట్లో గండి నారాయణమ్మ నివాసం ఉంటుంది. శనివారం ఆమె వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ నుంచి గ్యాస్ లీకు కావడంతో మంటలు వ్యాప్తించడంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వెంటనే అప్రమత్తంగా వ్యవహరించి ఆమె బయటకు రావడంతో ప్రాణపాయం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు వీఆర్వో లక్ష్మి సరసమ్మ తెలిపారు. కుమార్తె ఇంటివద్ద ఉన్న బాధితరాలు నారాయణమ్మకు ప్రభుత్వం తరుపున 25 కేజీల బియ్యం, చక్కెర, దాతల సహకారంతో కూరగాయలు, వంటనూనె వంటి నిత్యావసర వస్తువులు అందజేశారు.

పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల విడుదల


నిడదవోలులో ప్రవహిస్తున్న పశ్చిమడెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధికరిస్తున్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి శనివారం 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలైన నరసాపురం కాలువకు 2,130 క్యూసెక్కులు, తణుకు కాలువకు 674 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,077 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1,300 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 556 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని తెలిపారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు

- 8,500 మందికి అన్న సమారాధన
- విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శనివారం కావటంతో వేలాదిమంది భక్తులు ఆలయానికి పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించడంతో భక్తులు పరవశించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలి రావటంతో ఆలయప్రాంగణం చుట్టూ క్యూలైన్‌లు కిక్కిరిశాయి. దీంతో దర్శనానికి గంటల సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వందలాది మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో 8,500 మంది భక్తులకు ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలు సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన స్వామి వారికి పూలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం వంటి కార్యక్రమాలు గురించి భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామని తెలిపారు.

విద్యార్థి దశలోనే సాంకేతికతపై పట్టు సాధించాలి


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్సీ వంక

పెరవలి: విద్యార్థి దశ నుంచే శాస్త్ర సాంకేతిక అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకుంటే భవిష్యత్తుకు బంగారు బాట పడుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని ఖండవల్లి గ్రామంలో రవళి స్పిన్నింగ్ మిల్లును శనివారం సర్వోదయ విద్యానికేతన్ విద్యార్థులు పరిశీలించి, పలు సందేహాలను రవీంద్రనాథ్ అడిగి నివృత్తి చేసుకున్నారు. బాల్యం నుంచే శాస్త్ర సాంకేతిక అంశాలు అలవర్చుకుంటే ఉన్నత చదువులకు వచ్చేటప్పటికి వారికి అవగాహన ఉంటుందని తెలిపారు. భావి భారత పౌరులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడి ఇష్టంగా చదువును చదవాలని అప్పుడే అనుకున్నది సాధించవచ్చని తెలిపారు. చంద్రశేఖర్, పీఓ వీరాస్వామి, ఉడద సుబ్రహ్మణ్యం, సైపురెడ్డి గంగాధర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ బహూకరణ



వృద్ధురాలుకి వీల్‌చైర్ అందచేస్తున్న క్లబ్ సభ్యులు

నిడదవోలు రూరల్: రోటరీక్లబ్ నిడదవోలు మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో మండలంలోని తోగుమ్మి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆరుగొల్లు చిట్టెమ్మకు రూ.10 వేలు విలువచేసే వీల్‌చైర్‌ను శనివారం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు గుబ్బల సత్యప్రసాద్ తెలిపారు. క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాతల సహకారంతో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆనందం మురళీకృష్ణ, సలహాదారుడు ఇంజే శేఖర్, సభ్యులు బూరా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం


తల్లి పాల ప్రాధాన్యంపై వివరిస్తున్న వైద్యాధికారిణి తేజశ్రీ


తల్లిపాలపై ఆవశ్యకతను వివరిస్తున్న డీఎంహెచ్ఓ సంధ్య

పెరవలి: బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రిపాలు బిడ్డకు తప్పని సరిగా పట్టించాలని ఇవి బిడ్డ ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తిని అందిస్తాయని కానూరు పీహెచ్‌సీ వైద్యాదికారిణి పి.తేజశ్రీ తెలిపారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా శనివారం పీహెచ్‌సీ పరిధిలోని ఉసులుమర్రులో గర్భిణిలు, బాలింతలుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి మహిళ తన డెలివరీ అయిన గంటలోపు ముర్రిపాలు అందించినప్పుడే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. దీనితో ఇరువురు రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. బీపీ, షుగర్ పేషెంట్‌లకు పరీక్షలు నిర్వహించి, మందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె. జయమణి, రాజమోహన్, కెవి నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ పాలతో ఆరోగ్య సమస్యలు

నల్లజర్ల: బిడ్డ పుట్టిన గంటలోనే బిడ్డకు తల్లి పాలు అందిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, తల్లీబిడ్డల ఆరోగ్యం బాగుంటుందని కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డిహెచ్‌యంఓ జె.సంధ్య గర్భిణిలకు సూచించారు. శనివారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారంతో పాటు వ్యాధినిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత,వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కృత్రిమ పాల ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. సమావేశంలో డాక్టరు తెల్లం గంగాధరావు, సీహెచ్ఓ వెంకటశాస్త్రి, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వతో ప్రజల ఆస్తులకు భద్రత

నిడదవోలు రూరల్: స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తులను సరిహద్దులతో సహ భద్రత కలుగుతుందని ఎంపీడీఓ జగన్నాథరావు తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయంలో స్వామిత్వ కార్యక్రమంపై శనివారం సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటితో పాటు రోడ్లు, చెరువులు, పార్కులు, దేవాలయాలు, అంగన్‌వాడీ, హెల్త్‌సెంటర్లు, పంచాయతీ ఆస్తులు వంటివి సర్వే చేయాలన్నారు. సరైనా దస్తావేజులు లేని కారణంగా తమ సొంత ఇళ్లపై బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు జరపని వారికి స్వామిత్వ కార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.లక్ష్మినారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై సంతకాల సేకరణ

నిడదవోలు రూరల్: స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ డిమాండ్ చేవారు. మండలంలోని పెండ్యాలలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు వెలిగట్ల సురేష్ అధ్యక్షతన యూనియన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆదాని కంపెనీతో ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కారింకి రమేష్, వాకా సత్యనారాయణ, రాంబాబు, పుల్లూరి దుర్గాప్రసాద్, మిద్దే రాంబాబు, వెలిగట్ల వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తాళ్లపూడి: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ వైద్య సేవలు అందజేస్తున్నట్టు సాయిస్ఫూర్తి హస్పిటల్ సీఈవో గూడా విజయరాజు తెలిపారు. తాళ్లపూడిలోని మాంటీస్సోరీ హైస్కూల్ వద్ద శనివారం విద్యార్థులకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాళ్లపూడిలోని శ్రీ సాయి స్ఫూర్తి మల్టీ స్పెషాలీటి హస్పిటల్ ఆధ్వర్యంలో డా.వీటి వర్మ, డా.రామారావు, డా.మౌనిక తదితరులు 760 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా విటమిన్ టాబ్లెట్‌లు, ఇతర మందులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వీవీ అనీష్, హస్పటల్ ప్రతినిధి లింగంపల్లి సుధీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు మరువలేనివి


సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న భావన మధు

పెరవలి: కానూరు గ్రామ అభివృద్ధికి సచివాలయ ఉద్యోగులు చేసిన కృషి మరువలేనిదని, భవిష్యత్తులో వారు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని సర్పంచ్ భావన మధు ఆకాంక్షించారు. సచివాలయ ఉద్యోగులు బదిలీపై వెళ్లటంతో వారందరనీ శనివారం ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ అనేది సాధారణమే అయినా ఎంతో నిబద్ధతతో, ప్రజల పట్ల మర్యాదతో వ్యవహరించి బదిలీపై వెళ్లటం బాధగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, కొత్త ఉద్యోగులతో పాటు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతారోహకుడుకి సత్కారం


పర్వతారోహకుడు లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, సభ్యులు

నిడదవోలు: జాతీయ పర్వతారోహణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణానికి చెందిన పర్వతారోహకుడు కంచడపు లక్ష్మణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, గుంటుపల్లి సత్యసాయి, గుంటుపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వజననీ సేవారత్న అవార్డు ప్రదానం


అంబటి శ్రీనివాసరావు

నల్లజర్ల: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు, దూబచర్లకు చెందిన లయన్ అంబటి శ్రీనివాసరావు విశ్వజననీ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాదుకు చెందిన విశ్వజననీ ఫౌండేషన్ తూర్పుగోదావరి జిల్లా తరుపున ఈయనను ఎంపిక చేసినట్టు ఫౌండర్, చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం శనివారం పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదిన హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు యూనివర్శిటీలో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. గత 28 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో చేస్తున్న విద్య, సామాజిక రంగాలలో అందిస్తున్న సేవలకు నిదర్శనంగా ఈ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

'సుఖీభవ' నిధుల జమ

నల్లజర్ల: అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలోని 31,722 మంది రైతుల ఖాతాల్లో రూ.18.19 కోట్లు జమ చేయనున్నట్టు ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు తెలిపారు. నల్లజర్ల సహకార సంఘం భవనం వద్ద అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రైతులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నల్లజర్ల మండలంలో 8,810 మంది రైతులకు రూ.4.41 కోట్లు, దేవరపల్లిలో 6,993 మందికి రూ.4.90 కోట్లు, గోపాలపురంలో 7,869 మందికి రూ.3.93 కోట్లు, ద్వారకా తిరుమల మండలంలో 8,050 మందికి రూ.5.63 కోట్లు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వ్యవసాయ, ఉద్యాన అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.